క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

టంగుటూరు: గ్రామ శివారు పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం ఎస్సై ఖాదర్ బాషా తన సిబ్బందితో దాడి చేశారు. 5 గురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ. 6005 నదదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

నేడు గృహ సారథుల అవగాహన సదస్సు

మర్రిపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సచివాలయాల కన్వీనర్‌లు, వలంటీర్లు, గృహసారథుల అవగాహన సదస్సు జరుగుతుందని శనివారం వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని అన్ని సచివాలయ కన్వీనర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొనాలన్నారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు హాజరౌతారన్నారు.

నేడు జగనన్న సచివాలయ కన్వీనర్ల సమావేశం

సింగరాయకొండ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జగనన్న సచివాలయ కన్వీనర్ల సమావేశం జరగనున్నట్లు జె.సి.ఎస్ మండల ఇన్‌చార్జి తన్నీరు సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

కులం పేరుతో దూషించాడని ఫిర్యాదు

కొండపి: కులం పేరుతో ఓ వ్యక్తి కొట్టి, దూషించాడని మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి చెందిన నల్లపు చినమాలకొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ శనివారం తెలిపారు. పెదకండ్లగుంట గ్రామానికి చెందిన వలేటి శ్రీనివాసరావు అదే గ్రామానికి చెందిన నల్లపు చినమాలకొండయ్య వేసుకున్న పొగాకు చేనుకి బాడుగకు నీరు కట్టాడు. నీరు కట్టుడుకి రూ. 8వేలు తీసుకున్నాడు. ఈక్రమంలో చినమాలకొండయ్య శుక్రవారం సాయంత్రం గ్రామంలోని టీస్టాల్ వద్దకు చేరుకొని తనవద్ద ఎక్కువ డబ్బులు తీసుకుని శ్రీనివాసరావు.. నీరు పెట్టాడని చెప్పన్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన శ్రీనివాసరావు ఏంట్రా నామీద చెప్తున్నావంటూ కులం పేరుతో దూషిస్తూ కొట్టాడని చిన మాల కొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదల పక్షపాతి మస్తానయ్య



మస్తానయ్య స్థూపంవద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పామూరు: సీపీఐ దివంగత నాయకుడు నీరుకట్టు మస్తానయ్య పేదల పక్షపాతి అని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. మస్తానయ్య 24వ వర్ధంతి శనివారం స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పోతల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా స్థానిక కందుకూరు రోడ్డులోని మస్తానయ్య స్మారక స్థూపం వద్ద పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ గుజ్జుల యల్లమందారెడ్డి శిష్యునిగా పేదల సంక్షేమం కోసం కులం, మతం, పార్టీలకతీతంగా పనిచేసిన వ్యక్తి మస్తానయ్య అని, ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేటి నాయకులు పేదల సంక్షేమం కోసం పనిచేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టనున్న నిరసన, ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, రాగిపాటి సూరిబాబు, ఆకుల మోహన్‌రావు, ఐ.నరసింహారావు, పాలపర్తి మస్తాన్, ఇర్రి వెంకటరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పామూరు: కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వైద్యశాల క్యాంప్ కో ఆర్డినేటర్ బాలకోటయ్య తెలిపారు. వైద్యశిబిరంలో గుండె, ఎముకలు, కీళ్లు, నరాలు, గ్యాస్ట్రబుల్, ఉదర కోశ వ్యాధులు, కిడ్నీల్లో రాళ్లు, మూత్రకోశవ్యాధులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, సాధారణ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

7న ఆయాల ఇంటర్వ్యూలు

ఉలవపాడు: అంగన్‌వాడీ ఆయాల ఇంటర్వ్యూలు ఈ నెల 7న జరుగుతాయని ఉలవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ విజయకుమారి తెలిపారు. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ప్రాజెక్టు పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరుకావాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలన్నదే లక్ష్యం

- అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన

కందుకూరు అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. పట్టణం కోవూరు రోడ్డులోని జనార్దనకాలనీ పాత ఫారెస్ట్ భవనం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒకటో అర్బన్ హెల్త్ సెంటర్‌ను కోటారెడ్డి నగర్‌లో నిర్మించి చుట్టపక్కల పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. కోటారెడ్డినగర్‌తో పాటు ఆదిఆంధ్రకాలనీ, తూర్పు వడ్డెపాలెం, ప్రకాశం కాలనీ ప్రజలకు చాలా ఉపయోగకరంగా హెల్త్ సెంటరు పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల దూరం కావడంతో ప్రాథమిక చికిత్స అందించేందుకు పేదలు అత్యధికంగా నివసిస్తున్న కోవూరురోడ్డు ఏరియాలో రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కోటారెడ్డి నగర్‌లో ప్రారంభించుకున్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ ఇస్తామని, ఇది గర్భిణులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గతంలో కోటారెడ్డినగర్‌లో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.80 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని, పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకుని అదనంగా రూ.14 లక్షలు అడిగిన వెంటనే మంజూరు చేసినట్లు తెలిపారు. కమిషనర్ ఎస్. మనోహర్, తహసీల్దార్ సీతారామయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రియంవద, డాక్టర్ స్వాతి, డాక్టర్ బ్యూలగ్రేస్, డీఈ శ్రీరామూర్తి, ఏఈ లోకేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ తోకల కొండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరి వసంతరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె రఫీ, ఆవుల మాధవరావు, దారం మాల్యాద్రి, జాజుల కోటేశ్వరావు, గణేషం గంగిరెడ్డి, నగ్గళ్ల నారయ్య, మస్తాన్, రహీం, శివకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

హక్కుదారులను తేల్చాకే సర్వే చేయాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

మర్రిపూడి: మండల కేంద్రమైన మర్రిపూడి సర్వే నెంబరు 991–1లో (పశువులు మేపుకునేందుకు వదులుకున్నభూమి) 329 ఎకరాల మేత భూమికి హక్కుదారులను తేల్చిన అనంతరమే భూసర్వే చేయాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌కు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ మర్రిపూడి పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు ఉమ్మడిగా పశువులు మేపుకొనేందుకు లక్ష్మీనృసింహ స్వామికొండ సమీపంలో 329 ఎకరాల భూమిని వదులుకున్నారన్నారు. శతాబ్దాల క్రితం ఈ భూమికి హక్కుదారులుగా 57 మంది పేర్లు పెట్టడం జరిగిందని, అయితే తంద్రిపేర్లు మాత్రం కనబరచలేదన్నారు. 329 ఎకరాలు ఉన్న మేత భూమిని సుమారుగా 600 ఎకరాలుగా రిజిస్ట్రేషన్‌లు జరిగిన విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. అలాంటి భూమికి వంశవృక్షం, హక్కుదారులను తేల్చకుండా గ్రామస్తులు వదులుకున్న ఉమ్మడి ఆస్తిని కొలిచేందుకు సర్వేయర్లను ఎలా పంపుతారని సిబ్బందిని నిలదీశారు. తమ భూములను సర్వే చేయాలని, పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పేద రైతులకు మాత్రం పనులు చేయరన్నారు. సమస్యాత్మక భూమిలోకి ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్‌పెట్టాలని మండల తీర్మానం చేస్తున్నట్లు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల వద్ద రూ. 200 వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పన్నూరు, తంగెళ్ల, జగ్గరాజుపాలెం గ్రామాల్లోని దళితవాడల్లో మరమ్మతులకు గురైన విద్యుత్ వైర్లు మార్చాలని విద్యుత్ ఏఈ రామకృష్ణారెడ్డికి సూచించారు. విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను మార్చాలని చిలంకూరు సర్పంచ్ బ్రహ్మయ్య ఏఈ రామకృష్ణారెడ్డిని కోరారు. మర్రిపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి షాహిద మాట్లాడుతూ గర్భిణులు వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత తెలిపారు. మర్రిపూడిలో డిజిటల్ లైబ్రరీకి రూ. 16లక్షలు మంజూరైనట్లు పీఆర్ ఏఈ జాలయ్య తెలిపారు. 40 శాతం సబ్సిడీపై సమీకృతదాణ అందుబాటులో ఉందని పశువైద్యాధికారి శ్రావణి పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు ఎం. సుధారాణి, ఎంపీడీఓ ఎస్. సుదీపా, ఎంపీటీసీ యు. చిరంజీవి, కోఆప్షన్ సభ్యులు కోండ్రు ఇజ్రాయిల్ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

సమస్యలు తెలుసుకోవటానికే కాఫీ విత్ గృహ సారథి

సింగరాయకొండ: ప్రతి రోజూ కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలతో పాటు గ్రామంలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి అవకాశం కలుగుతుందని వరికూటి అశోక్ బాబు ధీమా వ్యక్తం చేశారు. బుంగబావి సెంటర్‌లో నివసిస్తున్న గృహసారథి షేక్ మహమ్మద్ ఇంటి వద్ద శనివారం ఉదయం కాఫీ విత్ గృహసారథి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ ప్రాంతవాసులు లోఓల్టేజీ సమస్య ఉందని, త్రీఫేజ్ కరెంటు సరఫరా లేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మురుగు కాల్వల్లో పూడిక తొలగించాలని వరికూటికి విన్నవించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నదే తన లక్ష్యమన్నారు. మండల సచివాలయ ఇన్‌చార్జి తన్నీరు సుబ్బారావు, గ్రామ కన్వీనర్లు షేక్ ఖాదర్‌బాషా, రాజు వెంకటేశ్వరరెడ్డి, షేక్ షమీన్, పార్టీ నాయకులు షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ సలీం, గాదంశెట్టి గుప్తా, రాయి రమేష్, షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.



సింగరాయకొండ–గృహ సారథులు, గ్రామ వలంటీర్లు, కన్వీనర్లతో మాట్లాడుతున్న వరికూటి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మాట్లాడుతున్న చైర్మన్ గఫార్



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

కనిగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ఎంహెచ్‌ఆర్‌ఎస్, ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత పర్యావరణ పరిరక్షణ, పచ్చదనంపై 2 కి.మీ రన్‌ను మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎస్సై దాసరి ప్రసాద్, ప్రిన్సిపాల్ హనుమంతరావులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పర్యవరణ పరిరక్షణపై హనుమంతరావు పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దేవకి రాజీవ్, ఏఎస్సై ముల్లా అహ్మద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

98 శాతం ఈ క్రాప్ నమోదు

హనుమంతునిపాడు: మండలంలో ఇప్పటి వరకు 98 శాతం పంటలను ఈ క్రాప్ నమోదు చేసి ఈకేవైసీ ధృవీకరించినట్లు ఏఓ సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం కూటాగుండ్ల పంచాయతీలో రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్ నమోదు చేసి ఈకేవైసీ చేశామన్నారు. వ్యవసాయ సహాయకులు ఆంద్రా కాశయ్య, నవ్య, దేవిరెడ్డి శారద, ఏడుకొండలు పాల్గొన్నారు.

వైఎస్సార్ పెన్షన్‌తో ఆర్థిక భరోసా

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక వృద్ధులు, ఒంటరి మహిళల్లో ఆర్థిక భరోసా నింపుతోందని సింగిల్‌విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, సచివాలయ కన్వీనర్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు అన్నారు. మండలంలోని వీరభద్రాపురం, దాదిరెడ్డిపల్లెతోపాటు గ్రామాల్లో వివిధ కారణాలతో నిలిచిపోయిన పెన్షన్లను పునరుద్ధరించగా వాటిని శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జొన్నలగడ్డ గోవిందయ్య, పూనాటి ప్రభాకర్ పాల్గొన్నారు.

83 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా శనివారం తిమ్మారెడ్డిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 83 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ ప్రతాపురెడ్డి, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గొడ్డలితో దాడి కేసులో భర్తకు రిమాండ్

సీఎస్‌పురం: భార్యపై గొడ్డలితో దాడి చేసి గాయపరచిన కేసులో భర్తకు రిమాండ్ విధించినట్లు ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని తుంగూడు గ్రామానికి చెందిన లక్ష్మీదేవిపై ఆమె భర్త దొర తిమ్మయ్య గత నెల 29వ తేదీన గొడ్డలితో దాడి చేసి గాయపరచాడు. ఈ కేసుకు సంబంధించి పరారీలో ఉన్న దొర తిమ్మయ్యను శుక్రవారం అరెస్ట్ చేసి నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు తిమ్మయ్యను శనివారం కనిగిరి కోర్టుకు తరలించగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

దాతల సహకారం అభినందనీయం

కనిగిరి రూరల్: దాతల సహకారం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బెడ్లపై దిండుల కొరత ఉండటంతో దాత, భాస్కర్ మెడికల్స్ అధినేత వాగిచర్ల రాము దిండ్లను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో వసతుల మెరుగుదలకు మున్సిపల్ నిధులు రూ. 15లక్షలు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, విశ్రాంత ఎంఈఓ ఎస్‌కే మస్తాన్ వలి, డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



భీమవరంలో వీరబ్రహ్మేంద్రస్వామి, నాగేంద్రుని గ్రామోత్సవం

ఉలవపాడు: మండలపరిధిలోని భీమవరంలో వీరబ్రహ్మేంద్రస్వామి, నాగేంద్రశిలా విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. నూతనంగా విగ్రహప్రతిష్ట పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేసి అనంతరం పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మహారుద్రహోమం జరిపారు. గణపతి పూజ, పీఠ దేవతా పూజలు చేశారు.

పంట నష్టం పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిరంజీవి, వ్యవసాయాధికారి స్వర్ణలత

టంగుటూరు: మండూస్ తుఫాన్‌తో నష్టపోయిన పంటల ఇ క్రాప్ నమోదు పునః పరిశీలనను అధికారు చేశారు. పొందూరు, మర్లపాడు, కందులూరు, గోసువారి గట్టుబడి ప్రాంతాల్లో తహసీల్దార్ చిరంజీవి, వ్యవసాయాధికారి స్వర్ణలత, సిబ్బందితో శనివారం పరిశీలించారు. మిరప, పొగాకు, శనగ పంటలు అధికాంగా దెబ్బతినడంతో వీఆర్వో, వ్యవసాయ సిబ్బంది నిర్వహించిన సర్వేను పరిశీలించి నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకిషోర్

సీఎస్‌పురం: ఇద్దరి మధ్య వివాదాస్పదంగా ఉన్న వ్యవసాయ భూమిని తహసీల్దార్ ఏ బాలకిషోర్ శనివారం పరిశీలించారు. మండలంలోని డీజీపేట రెవెన్యూ ఇలాకా 56 సర్వే నంబర్‌లో 17.60 ఎకరాల సెటిల్‌మెంట్ భూమి ఉంది. ఆ భూమి తమ పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిందనీ అయితే ఆ భూమిని వేరే వారి పేరుతో ఆన్‌లైన్ చేసి ఉన్నారనీ డీజీపేటకు చెందిన షేక్ పెదనబీ సాహెబ్, నాగూర్ మీరావలి, కరిముల్లా తదితర కుటుంబాల వారంటున్నారు. తమ భూమిని తమకు ఇప్పించాలని కోరుతూ పెదనబీసాహెబ్, నాగూర్‌మీరావలి, కరిముల్లాలు వారి వారి కుటుంబసభ్యులతో మూడు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఏ బాలకిషోర్ శనివారం ఆ పొలం వద్ద కు వెళ్లి రికార్డులను, భూమికి సంబంధించి లబ్ధిదారుల వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి గ్రామస్తులను విచారించారు. సర్వేయర్ రాజేష్, వీఆర్వో శివశంకర్, మాజీ ఎంపీటీసీ మితికేల గురవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం

పామూరు: మండలంలోని అయ్యన్నకోట పొలాల్లో శనివారం వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యన్నకోటలో గ్రామ రైతు తుమ్మా వెంకటేశ్వర్లు వరిపైరులో ఏడీఏ ఎ.వెంకటరమణ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఏడీఏ రమణ మాట్లాడుతూ వరిపంట దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. ప్రభుత్వం సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు, రైతుభరోసాతో ఆదుకోవడం ద్వారా సకాలంలో పంటలు వేసి అధిక దిగుబడులు పొంది రైతులు ఆర్థికంగా బలోపేతమవుతున్నారన్నారు. వీఏఏ యం.వినయ్, భీమాసంస్థ ప్రతినిది కిరణ్ పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న ఏడీఏ వెంకటరమణ, సిబ్బంది

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

సీఎస్‌పురం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జె. ప్రసాదరావు అన్నారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారి అభివృద్ధికి దోహదపడాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేసి వడ్డించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవరావు, సీఆర్పీ సతీష్, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, శోభారాణి, రమేష్ పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యం



టంగుటూరులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పని చేయాలని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సూచించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమయ్యేందుకు, పార్టీని పటిష్టం చేసేందుకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర తుస్‌మమందని ఎద్దేవా చేశారు. టీడీపీలో జన్మభూమి కమిటీలను పెట్టి ప్రజల వద్ద నుంచి లంచాలు వసూలు చేశారని, నీరు చెట్టు, బాత్‌రూం పేరుతో స్థానిక ఎమ్మెల్యే స్వామి పేద ప్రజలకు అందాల్సిన సొమ్మును దోచుకున్నారని ఆరోపించారు. కానీ జగనన్న పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల్లు అందిస్తూ మీ ఇంట్లో మంచి జరిగితేనే ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరుతున్నారన్నారు. రాష్ట్ర ఎంబీసీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, బీసీడి ఉదయకుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి, కుందం హనుమారెడ్డి, గుండపరెడ్డి డబుల్‌రెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ సభ్యులు సూదనగుంట వెంకటస్వామి, పులిచర్ల కోటిరెడ్డి, తన్నీరు చిన్న వీరనారాయణ, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పథకం ద్వారా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని గ్రామస్తులు తమ వంతు సహకారం అందించాలని వరికూటి అశోక్‌బాబు విజ్ఞప్తి చేశారు. కలికవాయ ప్రాథమిక పాఠశాలను శనివారం తనిఖీ చేశారు.గత సంవత్సరం పాఠశాలలో 132 మంది విద్యార్థులు ఉంటే ఈ సంవత్సరం 90 మంది మాత్రమే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ముగ్గురు టీచర్లు ఉంటే అధనంగా ఇద్దరు టీచర్లను నియమించామని తెలిపారు. వరికూటి భార్య లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శారద, సర్పంచ్ చిడిపోతు వెంకటరత్నం, ఎంపీటీసీ ఉలిచి అరుణకుమారి, హెచ్‌ఎం ఎస్. సురేంద్ర, చామల వేణుగోపాలరెడ్డి, శ్రీహరిరెడ్డి, చిడిపోతు కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): నందనవనం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నేతలు తెలిపారు. వరికూటి అశోక్‌బాబు ముఖ్య పాల్గొంటారన్నారు.

ఘనంగా మొహిద్దీన్ జయంతి

కందుకూరు అర్బన్: స్థానిక ఎస్‌టీయూ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు మగ్దూం మొహిద్దీన్ 115వ జయంతి కార్యక్రమం శనివారం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వై. అశోక్‌బాబు మాట్లాడుతూ గొప్ప పోరాట కమ్యూనిస్టు యోధుడుని స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ ఆనాటి నాయకులు త్యాగాల ఫలితంగానే ఎన్నో సాధించుకున్నామని పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు, మల్లికార్జున, మురళి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



మొహిద్దీన్ చిత్రపటానికి నివాళులర్పింస్తున్న ఎస్‌టీయూ నాయకులు

గృహ నిర్మాణ పనుల పరిశీలన

గుడ్లూరు: మండలంలోని చేవూరు, తెట్టు, ఏలూరుపాడు, వైఎస్సార్ జగనన్న కాలనీ గృహాల నిర్మాణాల పనులను ప్రత్యేకాధికారి, జిల్లా మైనింగ్ అధికారి సూర్యచంద్రరావు శనివారం పరిశీలించారు. మూడు గ్రామాల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో 155 గృహాల నిర్మాణాలు చేపట్టగా ఇప్పటికే 25 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన 130 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ గృహాల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి ఉగాది పండుగ నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్స్ ఎప్పటికప్పుడు అందచేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవకుమారి ఉన్నారు.



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రూ.26.86 కోట్లతో అభివృద్ధి పనులు

- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

కందుకూరు అర్బన్: మున్సిపాలిటీలో రూ.26.86 కోట్లతో త్వరలో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు. పాత కూరగాయల మార్కెట్ స్థలంలో నూతనంగా రూ.43 లక్షలతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని వివరించిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.26 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులకు సంబంధించి తొలిదశ పనులకు టెండర్లు పిలిచామన్నారు. మిగిలిన పనులకు కూడా మరో 10 రోజుల్లో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలో ప్రధానమైన డ్రైనేజీలను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలుగా మారుస్తామన్నారు. పట్టణ నడిబొడ్డున, ఇళ్ల మధ్యలో ఉన్న రాళ్లవాగు డ్రైనేజీని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర నుంచి సురేష్‌రెడ్డి చికెన్ సెంటర్ వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించామని, మిగిలి ఉన్న డ్రైనేజీని కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మారుస్తామన్నారు. జెండా చెట్టు వద్ద నుంచి గుండాంకట్ట మీదుగా శివాలయం వరకు సీసీరోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. పామూరు రోడ్డులో కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ కార్పొరేషన్‌తో సమానంగా కందుకూరు మున్సిపాలిటీ విస్తీర్ణంఉన్నా ఆదాయం కన్నా ఖర్చు అధికంగా ఉన్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ శాశ్వత ఆదాయం వనరులు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదురుగా 16 రూమ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ జరుగుతుందని, దాదాపు 60శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పురాతన పాత కూరగాయల మార్కెట్‌ను తొలగించి దాని స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ పనులు పూర్తి కాగానే మరో రెండు చోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్ల తెలిపారు. సబ్ కలెక్టర్ పరివేక్షణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్. మనోహర్, తహసీల్దార్ సీతారామయ్య, డీఈ శ్రీరామూర్తి, ఏఎంసీ మాజీ చైర్మన్ తోకలకొండయ్య, తల్లపనేని వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, దారం మాల్యాద్రి, చెక్కా వెంకటకేశవరావు, రహీం పాల్గొన్నారు.



షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే